సాక్షి
రాజన్న సిరిసిల్ల

గురువారం | 29 | ఆగస్టు | 2024

తెలుగు పలుకు.. తేనెలొలుకు

తెలుగు భాష ఈనాటిది కాదు. హాలుడు రచించిన గాథాసప్తశతి నాటికే తెలుగు పదాలు వాడుకలో ఉన్నట్లు చరిత్ర చెబుతోంది. తెలుగంటే అచ్చులు, హల్లులు కాదు. తెలుగంటే అమ్మ భాష. మాతృభాషలో నిష్ణాతులైనవారు పరభాషలను అవలీలగా నేర్చుకోగలరు. ఇంటర్‌నెట్‌లో తెలుగు పత్రికలు సాహితీసేవ ద్వారా భాషకు సముచిత స్థానం ఇస్తూ పాఠకులను పెంచుతున్నాయి. ఐప్యాడ్‌లో కూడా తెలుగు రాయడానికి వీలుగా తెలుగు ఎడిటర్ ఉపయోగించుకునే వీలుంది. మొబైల్స్ సైతం తెలుగు చదవగలిగేలా రూపొందుతున్నాయి. నేడు తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

– వివరాలు 8లో..



న్యూస్‌రీల్

నేత్రపర్వంగా మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన


వేడుకల్లో నాయకులు

సిరిసిల్లటౌన్: సిరిసిల్లలోని పాత కూరగాయల మార్కెట్‌లో బుధవారం మైసమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు నేత్ర పర్వంగా సాగాయి. ముఖ్య అతిథులుగా నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేంద ర్‌రెడ్డి పాల్గొన్నారు. వేలాది సంఖ్యలో భక్తులు, పట్టణ ప్రముఖులు, మార్కెట్ అసోసియేషన్ ప్రతినిధులు హాజరయ్యారు.

పాతపెన్షన్ విధానం పునరుద్ధరించాలి


మాట్లాడుతున్న గన్నమనేని శ్రీనివాసరావు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): కొత్త పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిం చాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గన్నమ నేని శ్రీనివాసరావు కోరారు. తంగళ్లపల్లి మండ లంలోని పలు ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, మండల పరిషత్ ప్రాథమిక పాఠ శాలలు, కేజీబీవీ, మోడల్ స్కూల్‌లో బుధ వారం పీఆర్టీయూటీఎస్ సభ్యత్వ నమోదు చేపట్టారు. నాయకులు ఎడ్ల కిషన్, బొంగు లిం గయ్యా, సత్తయ్య, కామినేని నీలి శ్రీనివాస్, దుబ్బాక ప్రభాకర్, ధర్మారెడ్డి తిరుపతిరెడ్డి, గుర్రం దేవదాసు, గోలి రాజు, ఐరెడ్డి సాం బారెడ్డి, ఎల్లంకి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి


ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

సిరిసిల్లఅర్బన్: మున్సిపల్ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీ యూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జు వేణు కోరారు. కలెక్టరేట్ ఎదుట సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కార్మికులు బుధవారం ధర్నా చేప ట్టిన సందర్భంగా మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగులకు వచ్చినట్లు సంక్షేమ పథకాలు అందక దుర్భర జీవితం గడుపుతున్నామ న్నారు. కనీస వేతనచట్టం ప్రకారం నెలకు రూ.26వేల వేతనం చెల్లించాలని కోరారు. ప్రధాన కార్యదర్శి కడారి రాములు, పందుల మల్లేశం, కోరెవు క్రాంతి, బండి ప్రశాంత్, మారుతి, కిరణ్, రాంబాబు, నరహరి, లక్ష్మణ్, భూమేశ్, లక్ష్మీరాజం, వినోద్, శ్రీనివాస్, రాజయ్య, దుర్గయ్య పాల్గొన్నారు.

అర్హులకు రుణమాఫీ

- జిల్లా వ్యవసాయాధికారి అఫ్జల్‌బేగం


మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి అఫ్జల్‌బేగం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): అర్హులకు రుణమాఫీ వర్తిస్తుందని జిల్లా వ్యవసాయాధికారి అఫ్జల్ బేగం పేర్కొన్నారు. మండలంలోని నారాయ ణపూర్‌లో బుధవారం రైతులతో సమావేశమ య్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రేషన్‌కార్డులో పేరు లేకున్నా రూ.2లక్షల రుణమాఫీ జరుగుతుందన్నారు. బ్యాంకుల్లో జరిగిన తప్పులతోనే రుణమాఫీ కాలేదని, వాటిని కూడా సరిచేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, కిసాన్‌సెల్ మండలాధ్యక్షుడు గుండాటి రాం రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు షేక్ గౌస్, ఏఈవో శ్రీశైలం పాల్గొన్నారు.

5న అథ్లెటిక్స్ పోటీలు

సిరిసిల్లఅర్బన్: పదో తెలంగాణ స్టేట్ సౌత్ జోన్ అథ్లెటిక్స్ పోటీలు సెప్టెంబర్ 5న నిర్వహి స్తున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్య క్షుడు బొజ్జ చంద్రశేఖర్ తెలిపారు. క్రీడాకారుల తల్లిదండ్రులు, వ్యాయామ ఉపాధ్యాయులు పోటీలకు సిద్ధం చేయాలని కోరారు. పోటీలు అండర్ 14, 16, 18, 20 విభాగాల్లో ఉం టాయని తెలిపారు. జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో నిర్వహించే పోటీలకు జిల్లాలోని 13 మండలాల క్రీడాకారులు హాజరుకావాలని కోరారు.

మొదటి గంట.. రికవరీకి మేలంట

అందుబాటులో హెల్ప్‌లైన్ నంబర్ 1930

- సైబర్ క్రైం జరిగిన గంటలోనే ఫిర్యాదు చేయాలి
- ఆలస్యమైన కొద్దీ డబ్బుపై ఆశలు వదులుకోవాల్సిందే..
- ఇప్పటివరకు ఉమ్మడి జిల్లాలో రూ.2.75 కోట్లు రికవరీ

సాక్షి ప్రతినిధి, కరీంనగర్:


రోడ్డు ప్రమాదం జరిగిన గంటలోపు ఆస్పత్రికి తీసు కొస్తే ప్రాణాలు కాపాడటానికి అవకాశం ఉంటుం దని డాక్టర్లు చెబుతుంటారు. దీన్ని వైద్య పరిభాష లో గోల్డెన్ అవర్ అంటారు. అలాగే, సైబర్ వలలో చిక్కుకొని మోసపోయినవారు మొదటి గంటలో ఫిర్యాదు చేస్తే సంబంధిత సొమ్మును రికవరీ చేయ వచ్చని పోలీసులు అంటున్నారు. మోసపోయిన నిమిషం తర్వాత ఫిర్యాదు చేస్తే దాన్ని డైమండ్ అవర్ అంటారు. బాధితులు ఇలా గోల్డెన్, డైమండ్ అవర్స్‌లోపే ఫిర్యాదు చేస్తే పోగొట్టుకున్న డబ్బు లను తిరిగి రాబట్టుకునే అవకాశం ఎక్కువగా ఉం టుంది. మొదటి గంటలోనే సైబర్ క్రైం రిపోర్టింగ్ పోర్టల్‌లో లేదా 1930 టోల్‌ఫ్రీ నంబర్, cybercrime.gov.in వెబ్‌సైట్‌కు ఫిర్యాదు చేసిన 70 శాతం కేసుల్లో పోలీసులు డబ్బులను రిక వరీ చేయగలిగారు. రాష్ట్రంలో ఈ ఏడాది సైబర్ నేరాల్లో రూ.87 కోట్లు రికవరీ చేయగా, ఉమ్మడి కరీంనగర్ జిల్లావ్యాప్తంగా రూ.2.75 కోట్లు చేశారు. చాలామంది ఎక్కడ ఫిర్యాదు చేయాలి? ఎలా చేయాలనే అంశాలపై కనీస అవగాహన లేకపో వడం, ఇతరులకు తెలిస్తే పరువు పోతుందన్న భయం తదితర కారణాలతో ఫిర్యాదు చేయడంలో జాప్యం చేస్తున్నారు. మరికొందరు అప్పటికప్పుడు గూగుల్‌లో కస్టమర్ నంబర్స్ కోసం సెర్చ్ చేసి, మరో సైబర్ వలలో చిక్కుకుంటున్నారు.

1930 నంబర్‌కే ఎందుకు?

దేశవ్యాప్తంగా మిగతా నేరాలతో పోలిస్తే సైబర్ నేరాలే వేగంగా పెరుగుతున్నాయి. దీన్ని గమనిం చిన కేంద్ర హోంశాఖ ఇండియన్ సైబర్ క్రైం కో–ఆ ర్డినేషన్ సెంటర్(ఐ4సీ)ను ఏర్పాటు చేసింది. నేర గాళ్లు ఇతర రాష్ట్రాలు, దేశాల్లో ఉండి, నేరాలకు పాల్పడుతుంటారు. దీంతో ఈ కేసులను దర్యాప్తు చేసి, పోయిన సొమ్మును రికవరీ చేయడం స్థానిక పోలీసులకు దాదాపు అసాధ్యం. ఐ4సీ ఆధ్వర్యంలో హెల్ప్‌లైన్ నంబర్ 1930కి ఫోన్ చేస్తే తెలంగాణ సైబర్ క్రైం కో–ఆర్డినేషన్ సెంటర్ సిబ్బంది స్పం దిస్తారు. బాధితుల సమాచారం తెలుసుకొని, సైబర్ క్రైం పోలీసుల అంతర్గత సైట్ ద్వారా ఆయా బ్యాంకులకు సమాచారం చేరవేస్తారు. దేశంలోని అన్ని బ్యాంకుల ప్రతినిధులు దీనికి అనుసంధా నమై ఉంటారు కాబట్టి ఆ డబ్బులు ఏ బ్యాంకు ఖాతావో గుర్తించి, వాటిని ఫ్రాడ్ లావాదేవీగా తేల్చి, ఫ్రీజ్ చేస్తారు. ఈ ప్రక్రియలో జాప్యం జరిగితే సైబర్ నేరగాళ్లు కొట్టేసిన డబ్బును ఇతర ఖాతాల్లోకి మళ్లించి, డ్రా చేసుకునే ప్రమాదం ఉం టుంది. అప్పుడు డబ్బు రికవరీ కష్టమవుతుంది.

కమిషనరేటర్ల పరిధిలో సైబర్ పోలీస్‌స్టేషన్

ఏటా జరుగుతున్న నేరాల్లో అధిక భాగం సైబర్‌వే ఉంటున్నాయి. దీంతో పోలీస్‌శాఖ అప్రమత్తమై అనేక చర్యలకు ఉపక్రమించింది. ప్రాథమికంగా అధికారులకు దర్యాప్తు తీరుతెన్నుల్లో మెలకువలు నేర్పుతున్నారు. ఇన్వెస్టిగేషన్ సపోర్ట్ సెంటర్(ఐ సీసీ) పేరిట ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసి, ఎథి కల్ హ్యాకర్లను ఏర్పాటు చేసుకోవడం, సిబ్బందికి శిక్షణ, అదనపు టూల్స్, అత్యాధునిక సాంకేతిక పరి జ్ఞానం వినియోగం వంటి చర్యలు తీసుకుంటున్నా రు. కరీంనగర్, రామగుండంలో ప్రత్యేంగా ఏసీపీ స్థాయి అధికారి నేతృత్వంలో సైబర్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేశారు.



చదువుకున్నవారే ఎక్కువ

లక్కీ డ్రాలో గెలిచారు.. తక్కువ ధరకే వాహనం, ఆఫర్స్ పేరిట కూపన్లతో షాపింగ్, క్లిక్ చేస్తే రుణం, క్రెడిట్‌కార్డులు అందిస్తాం, రూ.లక్ష వేతనంతో కూడిన వర్క్ ఫ్రం హోమ్ ఉద్యోగం, పాన్‌కార్డు అప్‌డేట్, బ్యాంక్ కేవైసీ చేస్తాం, ఓటీపీ చెప్పండి, వలపు వల ఇలా సైబర్ నేరాగాళ్లు విరుచుకుపడుతుండగా, బాధితుల్లో ఎక్కువ మంది విద్యావంతులే ఉంటున్నారు. సైబర్ మోసాల తీరు మారిం ది. ఒకదాని గురించి ప్రజలకు కొంత అవ గాహన వచ్చేలోగా మరోదానితో బురిడీ కొట్టిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో అనవసర సం దేశాలు, లింకుల జోలికి వెళ్లకపోవడమే ఉత్తమం. పిల్లలకు మొబైల్స్ ఇవ్వొద్దని, యూపీఐ పిన్ వివరాలు ఎవరికీ చెప్పవద్దని పోలీసులు సూచిస్తున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



సైబర్ నేరాల బారిన పడ కుండా ప్రజలు అప్రమ త్తంగా ఉండాలి. ఆన్‌లైన్ వేదికగా సైబర్ నేరాగాళ్లు విరుచుకుపడుతున్నారు. అనవసరమైన సైట్స్, లిం కులను క్లిక్ చేయొద్దు. ఓటీపీలు ఎవరికీ చెప్పొద్దు. అలాగే, మోసపోయిన తొలి గం టలోనే 1930కి కాల్ చేస్తే సొమ్ము రికవరీ చేయడానికి అవకాశం ఉంటుంది.

– వెంకటరమణ,
ఏసీపీ, సైబర్ క్రైం, రామగుండం

రేషన్‌కార్డు లేని రైతులకూ రుణమాఫీ


మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

- కరీంనగర్ జిల్లాలో 59 వేల మంది రైతులకు రూ.444 కోట్ల మాఫీ
- మంత్రి పొన్నం ప్రభాకర్, విప్ ఆది శ్రీనివాస్
- వేములవాడ కేడీసీసీ బ్యాంక్ భవనం ప్రారంభం

వేములవాడఅర్బన్: రేషన్‌కార్డు లేని రైతులకు కూడా రుణమాఫీ చేస్తామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నా రు. వేములవాడ ప్రాథమిక వ్యవసాయ సహకా ర సంఘం ఆధ్వర్యంలో రూ.21లక్షలతో నిర్మించిన సహకార సంఘం గోదాం, రూ.63లక్షలతో నిర్మిం చిన వేములవాడ కేడీసీసీ బ్యాంక్ భవనాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి బుధవారం ప్రారంభించి మాట్లాడారు. రేషన్ కార్డు లేని రైతుల వివరాల సేకరణకు అధికారులు విచారణ చేస్తున్నారని తెలిపారు. ఉమ్మడి కరీంన గర్ జిల్లాలో 59 వేల మంది రైతులకు రూ.444 కోట్ల రుణమాఫీ చేశామన్నారు. సహకార సంఘాల రైతుల పిల్లలకు విదేశీ విద్య కోసం రుణం ఇచ్చే అర్హత లేదని తెలిసిందని, దీనిపై కేంద్రంతో మాట్లా డి అనుమతి ఇవ్వాలని కోరుతామన్నారు. రవాణా శాఖ మంత్రిగా ఉండి 265 రోజుల్లో 85 కోట్ల మం ది మహిళలు ఉచిత ప్రయాణం చేయడం సంతోషం గా ఉందన్నారు. సెప్టెంబర్ 17 నుంచి ప్రజాపాలన లో భాగంగా రేషన్‌కార్డులు, ఆరోగ్యశ్రీ, ఇందిరమ్మ ఇళ్ల పథకాలు అందజేస్తామన్నారు. వేములవాడ లాంటి ప్రాంతంలోనూ సహకార సంఘాలు రూ. 150 కోట్ల వ్యాపారం చేసి 35 కోట్ల డిపాజిట్లు సాధించడం సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ సహకార సంఘా లు రైతులకు రుణాలు అందిస్తూ చేయూతనిస్తూనే.. సాగు విధానంలో నూతన ఒరవడిని అందించేలా వంగడాలు కూడా తయారుచేసి ఇవ్వాలన్నారు. మనల్ని నమ్ముకున్న రైతుకు జవాబుదారీగా ఉం టూ, రైతు తీసుకున్న రుణం ఎంత, బ్యాంకు వేస్తున్న లెక్కలు ఎంత, దానిపై ప్రతీ మూడు నెలల కోసారి అధికారులు పరిశీలించాలని సూచించారు. నాఫ్స్‌కాబ్, కేడీసీసీబీ జిల్లా చైర్మన్ కొండూరు రవీం దర్‌రావు, జిల్లా వైస్‌చైర్మన్ పింగిలి రమేశ్, డీసీఎం ఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, సీఈఓ సత్య నారాయణరావు, జిల్లా బ్యాంక్ డైరెక్టర్ తిరుప తిరెడ్డి, బ్యాంక్ మేనేజర్ సాయికుమార్ ఉన్నారు.

వీపీవోలు సత్సంబంధాలు కలిగి ఉండాలి


రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

- నేరాల నియంత్రణకు విజిబుల్ పోలీసింగ్ అమలు చేయాలి
- బ్లూ కోల్ట్స్ సిబ్బంది పాత నేరస్తులపై నిఘా ఉంచాలి
- బోయినపల్లి పోలీస్‌స్టేషన్ తనిఖీలో ఎస్పీ అఖిల్ మహాజన్

బోయినపల్లి(చొప్పదండి)/వేములవాడరూరల్: విలేజీ పోలీస్ అధికారులు తమకు కేటాయించిన గ్రామాల ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండా లని, నేరాల నియంత్రణకు విజిబుల్ పోలీసింగ్ అమలు చేయాలని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొ న్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా బుధవారం బోయినపల్లి, వేములవాడరూరల్ పోలీస్‌స్టేషన్ లను బుధవారం తనిఖీ చేశారు. ఠాణా పరిసరాలు, స్టేషన్‌లోని రికార్డులు, వర్టికల్స్ అమలు, పెండింగ్ లో ఉన్న గ్రేవ్, నాన్‌గ్రేవ్ సీడీఫైల్స్ తనిఖీ చేశారు. కేసుల వివరాలు తెలుసుకున్నారు. ఫిర్యాదులపై స్పందించి బాధితులకు న్యాయం జరిగేలా చూడా లన్నారు. బ్లూకోల్ట్స్ సిబ్బంది 100 డయల్ రాగానే స్పందించి సమస్య పరిష్కరించాలన్నారు. ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సైలు పృ థ్వీధర్‌గౌడ్, మారుతి ఉన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

- అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్


పూజార్ల ఆశీర్వాదం తీసుకుంటున్న అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్

వీర్నపల్లి(సిరిసిల్ల): విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ ఆదేశించారు. వీర్నపల్లిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని బుధ వారం తనిఖీ చేశారు. విద్యాలయం ఆవరణ, బియ్యం, కూరగాయలు పరిశీలించారు. తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. ఆవరణ పరిశుభ్రంగా ఉండాలని, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పిం చాలని సూచించారు. చదువుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, సబ్జెక్టుల్లో నైపుణ్యాలు పెంపొందిం చాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఏటా వర్షా కాలంలో వాగు పొంగి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, రాత్రి వేళ ఇంటికెళ్లే సమయంలో వీధిలైట్లు లేక కష్టంగా ఉందని సిబ్బంది అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించారు. అనంతరం మండలంలోని లాల్‌సిం గ్‌తండాలోని జగదాంబటెంపుల్‌ను సందర్శించి, మొక్కులు చెల్లించుకున్నారు. డీఈవో రమేశ్‌కు మార్, ఇన్‌చార్జి తహసీల్దార్ మారుతిరెడ్డి, విద్యా లయం ఎస్‌వో నీలిమ, ఆర్‌ఐ ప్రవీణ్, గోర్ బం జారాల పోరాదేవి పీఠాధిపతి బాబుసింగ్ మహారాజ్ పాల్గొన్నారు.

టీఎల్‌ఎం కిట్లు పంపిణీ


దివ్యాంగ విద్యార్థులకు కిట్లు పంపిణీ చేస్తున్న డీఈవో రమేశ్‌కుమార్

సిరిసిల్లటౌన్: మేతో దివ్యాంగ విద్యార్థులకు బుధవారం టీఎల్‌ఎం కిట్లు పంపిణీ చేశారు. సిరిసిల్ల మండల విద్యావనరుల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో డీఈవో రమేశ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో వివిధ పాఠశాలల్లో చదువుతున్న ఆరుగురు విద్యార్థులకు టీచింగ్, లెర్నింగ్ మెటీరియల్ కిట్లు అందించామ న్నారు. ఎన్‌ఐఈపీఐడీ సంస్థ కోఆర్డినేటర్ ఎస్.లక్ష్మణ్‌బాబు, ఎంఈవో దూస రఘుపతి, సతీశ్‌కుమార్ పాల్గొన్నారు.

'రెగ్యులర్ చేయాలి'

తమ ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలని సమగ్ర శిక్షా కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు తుమ్మ రాజేందర్, ప్రధాన కార్యదర్శి ఎండీ ఖయ్యూం కోరారు. ఈమే రకు బుధవారం డీఈవోకు వినతిపత్రాన్ని అం దించారు. ఈ.జ్యోతి, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రి సిబ్బంది దాష్టీకం

- గిరిజన మహిళకు చికిత్సలో నిర్లక్ష్యం


బాధితురాలు భూక్య రాణి

సిరిసిల్లటౌన్: ధర్మాస్పత్రిలో సిబ్బంది దాష్టీకంతో ఓ గిరిజన మహిళ అత్యవసర చికిత్సకు విలవిల్లాడిన సంఘటన బుధవారం సిరిసిల్ల జిల్లా ఆస్పత్రిలో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాలు. చందుర్తి మండలం మానాలకు చెందిన భూక్య విఠల్ తన భార్య రాణికి నాలుగు రోజుల క్రితం జ్వరంరాగా చికిత్స పొందుతోంది. మంగళవారం నుంచి తీవ్ర కడుపునొప్పి రావడంతో బుధవారం వేములవాడ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లాడు. అక్కడి వైద్యులు స్కానింగ్ చేయించాలని జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. ఇంతదూరం రావడం ఆలస్యమవుతుందన్న భయంతో విఠల్ వేములవాడలోనే ఓ ప్రైవేటు డయాగ్నోస్టిక్ సెం టర్లో స్కానింగ్ చేయించగా.. కడుపులో ఇన్‌ఫెక్షన్ ఉందని, అది అపెండిసైటిస్ కావచ్చని జిల్లా ఆసు పత్రికి తీసుకెళ్లాలని వేములవాడ ఆస్పత్రి వైద్యులు రెఫర్ చేసినట్లు తెలిపాడు. సిరిసిల్ల జిల్లా ఆస్పత్రికి బుధవారం ఉదయం 11.15 గంటలకు తీసుకు రాగా.. అడ్మిట్ చేసుకోకుండా సిబ్బంది ఇబ్బంది పెట్టారన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు ఐపీ వార్డు లో డ్యూటీ చేసే వైద్యుడు వచ్చి మందులు రాసి వెళ్లిపొమ్మన్నారని తెలిపారు. రాణి అవస్థ ఎక్కువ గా ఉండడంతో విఠల్ మీడియాకు తన బాధను తెలుపుకున్నాడు. మీడియా జోక్యంతో జిల్లా ఆసుప త్రి ఉన్నతాధికారులు స్పందించి చికిత్స అందించ డానికి అడ్మిట్ చేసుకోవడం విశేషం. కాగా రాణి ఓపీ సమయం తర్వాత వచ్చిందని ఎమర్జెన్సీ వార్డు లో వైద్యులు ట్రీట్‌మెంట్ ప్రొసీజర్ ప్రకారమే మం దులు రాసిచ్చారని డ్యూటీ డాక్టర్ వివరించారు.

విద్యుత్ చట్టాన్ని సవరించాలి


అమర వీరులకు నివాళి అర్పిస్తున్న సీపీఎం నేతలు

- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు టి.స్కైలాబ్‌బాబు
- విద్యుత్ పోరాట అమరవీరుల సంస్మరణ సభ

సిరిసిల్లటౌన్: కేంద్రం తీసుకొచ్చిన విద్యుత్ చట్టాన్ని సవరించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు టి.స్కైలాబ్‌బాబు కోరారు. సిరిసిల్లలోని పార్టీ ఆఫీస్‌లో బుధవారం బషీర్‌బాగ్‌లో విద్యుత్ పోరాటంలో అసువులు బాసిన పార్టీ కార్యకర్తలు విష్ణువర్ధన్‌రెడ్డి, రామకృష్ణ, బాలస్వామి తదితరుల సంస్మరణ సభ నిర్వహించారు. స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ 2000 సంవత్సరంలో అప్పటి సీఎం చంద్రబాబునాయుడు ప్రపంచ బ్యాంకు నిబంధన లకు తలొగ్గి విద్యుత్ ప్రైవేటీకరణకు తీసుకున్న నిర్ణ యాన్ని సీపీఎం, ఇతర వామపక్షాలు వ్యతిరేకిం చాయన్నారు. ఆనాటి అమరుల త్యాగంతోనే ప్రస్తుత ప్రభుత్వాలు ఉచిత విద్యుత్ అందిస్తున్నా యని తెలిపారు. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం విద్యుత్ చట్టాన్ని తీసుకొచ్చి రైతులు, సామన్యులకు నష్టం చేస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నిరు పేదలందరికీ గృహజ్యోతి అందించాలని కోరారు. మూశం రమేశ్, కోడం రమణ, మల్లారపు అరుణ్‌కు మార్, జువ్వాజి విమల, ఎరవెల్లి నాగరాజు, మల్లా రపు ప్రశాంత్ పాల్గొన్నారు.

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో తనిఖీలు

వేములవాడ: స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో కరీంనగర్ డీఐజీ రవీందర్ బుధవారం తనిఖీలు చేశారు. కార్యాలయంలో రిజిస్ట్రేషన్ దస్తావేజులు, రికార్డులు, రికార్డుగదిని పరిశీలించారు. రిజిస్ట్రేషన్‌ల కోసం వచ్చే ప్రజలకు జవాబుదారీగా పనిచేయాలన్నారు. క్రయవిక్ర యదారులతో మర్యాదపూర్వకంగా మెదలుకోవాలని సిబ్బందికి సూచించారు. ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ రజిత ఉన్నారు.


రికార్డులు పరిశీలిస్తున్న కరీంనగర్ డీఐజీ రవీందర్

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు

సిరిసిల్లఅర్బన్: షరతులు లేకుండా రూ.2లక్షల రుణమాఫీ అమలు చేయాలని తెలం గాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తీపిరెడ్డి తిరుపతిరెడ్డి కోరారు. కలెక్టరేట్ ఎదుట బుధవారం రైతుసంఘం నాయకులు ధర్నా చేపట్టారు. తిరుపతిరెడ్డి మాట్లా డుతూ రాష్ట్రంలోని 53 శాతం మంది రైతులకు మాత్రమే 3 విడతలుగా రుణమాఫీ చేశా రని మిగతా 47 శాతం మంది రైతులకు కాలేదన్నారు. అందరికీ రుణమాఫీ చేయాలని కోరారు. ప్రధాన కార్యదర్శి జంగిటి అంజయ్య, పంతం రవి, సోమ నాగరాజు, రవి, క్రాంతి, వేణు, రాములు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాష్ట్రవ్యాప్తంగా ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలి

- మంత్రి ప్రభాకర్, విప్ శ్రీనివాస్‌లకు జర్నలిస్టుల వినతి



వేములవాడ అర్బన్: అక్రిడిటేషన్ జర్నలిస్టులందరికీ రాష్ట్రవ్యాప్తంగా అన్ని రకాల ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని జర్నలిస్టులు కోరారు. రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ బుధవారం వేములవాడ పట్టణంలోని ప్రెస్ క్లబ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఉచిత బస్సు సౌకర్యం, ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు చేయాలని కోరుతూ వారికి టీయూడబ్ల్యూజే(ఐజేయూ) ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. సంఘం రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు దండి సంతోష్‌కుమార్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దాసరి దేవేందర్, వేములవాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు పుట్టపాక లక్ష్మణ్, కార్యదర్శి మహేశ్, ఉపాధ్యక్షుడు ప్రశాంత్, సంయుక్త కార్యదర్శి సంపత్, కోశాధికారి నరేశ్ ఉన్నారు.

దుర్శేడ్‌లో ఒకరికి డెంగీ

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం దుర్శేడ్‌లో డెంగీ కేసు నమోదైంది. 4వ వార్డుకు చెందిన యువకుడికి రెండు రోజుల క్రితం జ్వరం రావడంతో కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యపరీక్షలు చేయించుకోగా డెంగీగా నిర్ధారణ అయ్యింది. అప్పటినుంచి అతను ఆస్పత్రిలోనే చికిత్స పొందుతున్నాడు. గత నెలలో రెండు కేసులు నమోదయ్యాయి. గ్రామంలోని నేతకాని, బుడిగెజంగాల కాలనీలు, 4వ వార్డు, పద్మశాలీ వీధుల్లో పలువురు విషజ్వరాలతో బాధ పడుతున్నారు. అయితే, డెంగీ కేసు నమోదుపై డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి సమాచారం రాలేదని చామనపల్లి పీహెచ్‌సీ వైద్యుడు మనోహర్ తెలిపారు. ముందు జాగ్రత్తగా గురువారం 4వ వార్డులో వైద్య శిబిరం ఏర్పాటు చేసి, స్థానికులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ముస్తాబాద్(సిరిసిల్ల): వికాస తరంగిణి ఆధ్వర్యంలో జిల్లాస్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ఆవునూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. 'మాతృదేశం పట్ల నా కృతజ్ఞత భావం' అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ఇంగ్లిష్‌లో బుశ్రా, తెలుగులో పాక హారిక మొదటి బహుమతులు సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. వారధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కో–ఎడ్యుకేషన్‌పై నిర్వహించిన వ్యాసరచనలో బుశ్రా, దేవిక, నిఖిల్‌సాయి ప్రథమ స్థానంలో నిలిచారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌పై డిబేట్‌లో అశ్విత, సాహితి, స్నేహిత ప్రథమస్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. హెచ్‌ఎం మద్దికుంట లక్ష్మణ్, పాఠశాల కమిటీచైర్మన్ మంజుల, ఉపాధ్యాయులు శారద, పర్శరాములు, లక్ష్మీనారాయణ, గణేశ్, విశ్వనాథ్, సువర్ణ, కవిత, పద్మలత, మనోహర్, కవిత, ప్రభాకర్, దీప్తి, శ్రీలత అభినందించారు.

తెలుగు పలుకు.. తేనెలొలుకు

- మాతృభాషను ప్రేమించాలి
- నేడు తెలుగు భాషా దినోత్సవం

తెలుగు భాషా దినోత్సవ శుభాకాంక్షలు



గిడుగు రామమూర్తి

విద్యానగర్(కరీంనగర్): గిడుగు రామమూర్తి పంతులు వ్యవహారిక భాష కోసం ఆయన జీవితాన్ని ధారబోశారు. రక్త, స్నేహ బంధాలు, కుల, మత సంబంధాలకు ఎంత ప్రేమ, గౌరవం ఇస్తామో తెలుగు భాషకు కూడా అంతే గౌరవం ఇమ్మన్నారు. తెలుగు భాషా వికాసానికి గిడుగు వెంకట రామమూర్తి అందించిన సేవలు సదాస్మరణీయం. తెలుగు భాషలో గ్రాంథిక వాదానికి స్వస్తి చెప్పి, వ్యవహారిక వాదానికి శ్రీకారం చుట్టిన భాషోద్యమకారుడాయన. ఆయన జయంతి(ఆగస్టు 29)ని ఏటా మనం తెలుగు భాషా దినోత్సవంగా జరుపుకుంటున్నాం.

వాడుక భాషలో లఘుచిత్రాలు



మాది చొప్పదండి మండలంలోని ఆర్నకొండ గ్రామం. మా ఆయన చీరెలు నేస్తాడు. మాకు పాప ఉంది. సర్పోజి ద్వారా నేను లఘు చిత్రాల ఫీల్డ్‌లోకి వచ్చాను. నేను నటించేవన్నీ మన వాడుక భాషలోనే ఉంటాయి. ఇప్పటివరకు 1,500 వరకు లఘుచిత్రాలు, 4 వెబ్ సిరీస్, ప్లాంట్ మ్యాన్ మూవీ, బ్రహ్మచారి, శివ శంభో తదితర సినిమాల్లో నటించాను. ప్రస్తుతం గేమ్ చేంజర్ ఆర్‌సీ 15 మూవీలో యాక్ట్ చేస్తున్న.

– స్రవంతి, సినీ నటి

పల్లె భాషపై మమకారం



మాది తోటపల్లి దగ్గర లోని బేగంపేట్. పల్లెలో పుట్టి పెరగడం వల్ల పల్లె భాషపై మమకారం ఎక్కువ. మా నాన్న గాయకుడు, రంగస్థడు కావడంతో చిన్నప్పటి నుంచి పాటల మీద, నటన మీద ఆసక్తి పెరిగింది. చిన్న చిన్న కథలు, పాటలు రాసేవాన్ని. స్నేహితుల సహకారంతో లఘు చిత్రాలకు దర్శకత్వం వహించడం ప్రారంభించా. మా పాపతోనే బుట్టర్ ఫ్లై టైటిల్‌తో తొలి షార్ట్ ఫిల్మ్ తీశాను.

– మడుపు శ్రీనివాస్, కథా రచయిత, దర్శకుడు, కరీంనగర్

కట్టుబొట్టు మరిచిపోతున్నాం



ఇంగ్లిష్ సంస్కృతి మోజులో మన కట్టుబొట్టు, భాషను మరిచిపోతున్నాం. పల్లె భాష పలకరింపులో ప్రేమ, ఆప్యాయత ఉంటాయి. నేను నటించి, నిర్మించిన ఆచార్య దేవోభవ, అల్లరి పిల్ల, అల్లిబిల్లి ఆంజనేయులు, అమ్మలేని బతుకు, మేముసైతం, గోమాత పాటలు–2, శ్రీనివాస మంగాపురం, మజిలీ, ప్రేమించే మనసు, మా చెల్లి పెళ్లికి మీ బలగంతో రండి తదితర లఘుచిత్రాల్లో పల్లె భాషకే ప్రాధాన్యం ఇచ్చాను.

– వేములవాడ ద్రోణాచారి, నటుడు, నిర్మాత, కరీంనగర్

సామాజిక రుగ్మతలపై చిత్రాలు



నాకు సినిమాలంటే ఆసక్తి. చాలా సినిమాలకు సహదర్శకుడిగా పని చేశాను. కరీంనగర్‌లో మోడ్రన్ యాక్టింగ్ స్కూల్ ఆఫ్ కరీంనగర్ పేరిట ఇన్‌స్టిట్యూట్ నిర్వహిస్తూనే మన భాషలో సామాజిక రుగ్మతలపై లఘుచిత్రాలు నిర్మిస్తున్నాను. చేంజ్, హెచ్‌సీఎల్, అచ్చిందు, లిటిల్ రాస్కెల్, ఈజీ మనీ, ఆల్‌వేస్ బీ కేర్‌ఫుల్, కసి, సారాపై సమరం వంటి 25 వరకు సందేశాత్మక లఘుచిత్రాలను స్థానికులతోనే నిర్మించాను.

– అనసూరి భూనాథచారి, దర్శకుడు, కరీంనగర్

మా ఆయన ప్రోత్సాహంతో..



మా ఆయన ఇచ్చిన ప్రోత్సాహంతోనే నేను లఘుచిత్రాలు, సినిమాల్లో నటిస్తున్నాను. ఇప్పటివరకు దాదాపు 1,000 లఘుచిత్రాల్లో, 5, 6 సినిమాల్లో నటించాను. సహజనటిగా నాకు గుర్తింపు, దాని ద్వారానే షార్ట్‌ఫిల్మ్స్‌లో అవకాశాలు వచ్చాయి. మన ఇళ్లలో ఎలా మాట్లాడుకుంటారో నా భాష కూడా అలాగే ఉంటుంది.

– జి.రాధిక, సినీ నటి, మార్కండేయ కాలనీ, కరీంనగర్

లక్షల మంది ఫాలోవర్స్



ఆర్‌ఎస్ నంద యూట్యూబ్ విలేజ్ కామెడీ నాకు నటుడిగా విశ్వవ్యాప్త గుర్తింపు తీసుకువచ్చింది. తెలంగాణ గ్రామీణ భాష, యాసలో నేను ఇప్పటివరకు 225 లఘుచిత్రాలతోపాటు 12 సినిమాల్లో నటించాను. గుట్టల్లో గుసగుస నా తొలి షార్ట్‌ఫిల్మ్. పల్లెటూరి వాడుక భాషలో తీశాను. పరిచయం అక్కరలేని సహజ హాస్య నటుడిగా నాకు యూట్యూబ్‌లో 6 లక్షల మంది ఫాలోవర్స్ ఉన్నారు.

– రాదండి సదయ్య, యూట్యూబ్ కామెడీ స్టార్, కరీంనగర్

ఊసేలేని తెలుగు మహాసభలు

ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారిని ఒక వేదికపై సమావేశపరిచి, తెలుగు భాషా సంస్కృతి, చరిత్ర, కళల విశిష్టతను తెలుసుకొని, ఇతర దేశాలతో స్నేహ సంబంధాలను వృద్ధి చేసుకునే లక్ష్యంతో ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ప్రభుత్వం ప్రపంచ తెలుగు మహాసభలకు శ్రీకారం చుట్టింది. మొదటిసారి 1975 ఏప్రిల్ 12 నుంచి 18వ తేదీ వరకు హైదరాబాద్‌లోని లాల్ బహదూర్ స్టేడియంలో సభలు జరిగాయి. చివరగా 2012లో ఉమ్మడి ఏపీ ప్రభుత్వం నిర్వహించింది. తెలంగాణ ఏర్పడిన తర్వాత హైదరాబాద్‌లో 2017 అక్టోబర్‌లో జరిగాయి. అనంతరం ఇప్పటివరకు తెలుగు మహాసభల ఊసే లేదు.

యూట్యూబ్‌లో తెలుగు పాఠ్యాంశాలు



తిరుపతి

పిల్లలు తెలుగు పదాలను దోష రహితంగా రాయడానికి, భాషను సులువుగా నేర్చుకొని, పట్టు సాధించడానికి వీలుగా తెలుగు ఉపాధ్యాయుడు, తెలుగు భాషా పరిరక్షణ ఉద్యమకారుడు కరీంనగర్‌కు చెందిన కవి, రచయిత కూకట్ల తిరుపతి యూట్యూబ్‌లో పాఠ్యాంశాలను పొందుపరిచారు. సంస్కృతీ సంప్రదాయాలను పాటిస్తూ ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడానికి వీలుగా అనేక అంశాలను చేర్చారు.

మాతృభాష ఆయువుపట్టు



మనిషి జీవన విధానంలో ఆయువుపట్టు వంటిది మాతృభాష. మానవ సంబంధాలను పటిష్టం చేస్తుంది. ఇది కేవలం మాట్లాడుకోవడానికే కాదు మనమేమిటో, మన సంస్కృతి ఏమిటో తెలుసుకోవడానికి దోహదపడుతుంది.

– నంది శ్రీనివాస్, తెలుగు పండిట్, ప్రభుత్వ పాఠ్యపుస్తక రచయిత, కరీంనగర్

అమ్మభాషకు ప్రాధాన్యం ఇవ్వాలి



ఆంగ్ల భాషను బోధనా మాధ్యమంగా చేయడం వల్ల పిల్లలకు దానిపై పట్టు వస్తుందన్న వాదనలు పూర్తిగా అశాస్త్రీయమైనవి. విద్యాహక్కు చట్టం స్ఫూర్తిని కాలరాస్తూ ప్రాథమిక స్థాయి నుంచే ఆంగ్ల బోధనకు జైకొట్టడం సరికాదు. విద్యారంగం, పరిపాలన, న్యాయవ్యవస్థల్లో ప్రాధాన్యం ఇచ్చినప్పుడే అమ్మభాషకు అగ్రతాంబూలం లభిస్తుంది.

– మెతుకు హేమలత, న్యాయవాది, కరీంనగర్

తార్కిక బుద్ధికి బలం..



మాతృభాషలో బోధన విద్యార్థి జన్మ హక్కు. మాతృస్తన్యం శరీరానికి బలమిస్తే మాతృభాష తార్కిక బుద్ధికి బలాన్నిస్తుంది. ప్రాథమిక స్థాయిలో పడిన అక్షర బీజాలు ఉన్నత స్థాయిలో ఆలోచింపజేస్తాయి.

– బూర్ల వెంకటేశ్వర్లు, కవి, రచయిత, తెలుగు సహాయాచార్యుడు, కరీంనగర్

మన భాషను కాపాడుకోవాలి



పిల్లలకు ఆంగ్లంలో అక్షరాభ్యాసం చేయించే దురదృష్టకర ఒరవడి బాధిస్తోంది. నవతరం భవిష్యత్తుకు అదే గొడ్డలిపెట్టుగా పరిణమిస్తుంది. దేశంలోని ప్రాచీన భాషల్లో ఒకటిగా కేంద్ర ప్రభుత్వం గుర్తించిన మన భాషను కాపాడుకుంటూ మన ఆత్మగౌరవాన్ని నిలబెట్టుకోవాలి.

– కొత్త అనిల్‌కుమార్, తెలంగాణ రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు, కరీంనగర్

ముస్తాబాద్‌లో గంజాయి విక్రేత అరెస్టు



నిందితుడి అరెస్టు చూపుతున్న సీఐ మొగిలి

సిరిసిల్ల/ముస్తాబాద్: గంజాయి విక్రయిస్తున్న ఓ యువకుడిని అరెస్టు చేసినట్లు సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి బుధవారం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. వేములవాడ మండలంలోని జయ్యారం గ్రామానికి చెందిన దప్పుల వంశీ ఇంటర్మీడియట్ చదివేటప్పుడు గంజాయికు అలవాటు పడ్డాడు. హైదరాబాద్‌లో సినిమాటోగ్రఫీ కోర్సు చేసేందుకు వెళ్లి, జల్సాలు చేశాడు. వేములవాడ వచ్చి ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. అతనికి తెలిసిన వ్యక్తుల వద్ద గంజాయి కొనుగోలు చేసి, ఎక్కువ ధరకు విక్రయిస్తున్నాడు. ఈ క్రమంలో వంశీ ముస్తాబాద్ ప్రాంతంలో పలువురికి గంజాయి అమ్మేందుకు వస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఎస్సై గణేశ్ తన సిబ్బందితో వెంటనే వెళ్లగా ముస్తాబాద్ శివారులోని ఓ ఫంక్షన్‌హాల్ వద్ద అతను అనుమానాస్పదంగా కనిపించాడు. అదుపులోకి తీసుకొని, తనిఖీ చేయగా 100 గ్రాముల గంజాయి లభ్యమైంది. గంజాయితోపాటు స్కూటీ, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. వంశీని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

3, 4న 'అల్ఫోర్స్'లో ఎస్జీఎఫ్ క్రీడాపోటీలు



మాట్లాడుతున్న ఎంఈవో వేణుకుమార్



పురావస్తు ప్రదర్శనశాలలో విద్యార్థినులు

కొత్తపల్లి(కరీంనగర్): కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ–టెక్నో స్కూల్లో మండల స్థాయి ఎస్జీఎఫ్ క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో వేణుకుమార్ తెలిపారు. పాఠశాలలో బుధవారం నిర్వహించిన మండల స్థాయి పాఠశాలల క్రీడా సమాఖ్య వ్యాయామ ఉపాధ్యాయుల సమావేశానికి ఆయన హాజరై, మాట్లాడారు. ఎస్జీఎఫ్ మండల కార్యదర్శి గిన్నె లక్ష్మణ్ క్రీడల షెడ్యూల్ వెల్లడించారు. అండర్–14, 17 విభాగాల్లో వచ్చే నెల 3న బాలికలకు, 4న బాలురకు ఖో–ఖో, కబడ్డీ, వాలీ బాల్ క్రీడల్లో ఎంపిక పోటీలు నిర్వహిస్తామన్నారు. అలాగే, కరీంనగర్‌లోని అంబేడ్కర్ స్టేడియంలో 6న అండర్–14, 17 విభాగాల్లో బాలబాలికలకు అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు ఉంటాయన్నారు. ఆయా క్రీడాంశాల్లో పాల్గొనే క్రీడాకారులు జనన ధ్రువపత్రాలతో హాజరు కావాలని సూచించారు.

పురావస్తు ప్రదర్శనశాల సందర్శన

కరీంనగర్‌లోని అల్ఫోర్స్ ఇ–టెక్నో బాలికల పాఠశాలకు చెందిన 6, 7వ తరగతుల విద్యార్థినులు బుధవారం కరీంనగర్ పురావస్తు పరిశోధన, ప్రదర్శనశాలను సందర్శించారు. తెలుగు లిపి పరిణామ పట్టిక, బృహత్ శిలాయుగం నాటి అవశేషాలు, ప్రాచీన చారిత్రక యుగం నాటి మట్టి పాత్రలు, గాజు ముక్కలు, టెర్రకోట బొమ్మలు, మొఘలుల కాలం నాటి శాలువాలు, అసఫ్‌జాహీలు, కుతుబ్ షాహీల కాలం నాటి కత్తులు, బాణాలు, బాకులు, గొడ్డళ్లు తదితర ఆయుధాలను పరిశీలించారు. పురావస్తు శాలలను సందర్శించడం వల్ల విద్యార్థులకు మన చరిత్ర, సంస్కృతిపై అవగాహన వస్తుందని టీచర్లు తెలిపారు.

భావప్రకటన స్వేచ్ఛ అమలు చేయాలి

- మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ తిరుపతయ్య



మాట్లాడుతున్న తిరుపతయ్య

జమ్మికుంట(హుజూరాబాద్): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలతోపాటు ప్రజాస్వామ్య పునరుద్ధరణ, భావప్రకటన స్వేచ్ఛను ఏడో హామీగా అమలు చేయాలని తెలంగాణ మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ తిరుపతయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జమ్మికుంట పట్టణంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి, సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. 9 నెలలుగా గత ప్రభుత్వం మాదిరిగానే రాష్ట్రంలో పోలీసుల అణిచివేత కొనసాగుతోందని ఆరోపించారు. సభలు, సమావేశాలు, నిరసనలకు అనుమతి ఇవ్వడం లేదని, ముందుస్తు అరెస్టుల పేరిట భయానక వాతావరణం సృష్టిస్తున్నారని అన్నారు. సీఎం స్పందించి, దీనిపై దృష్టిసారించాలని కోరారు. వేదిక సభ్యులు అచ్యుత్, కిరణ్, కొత్తూరు కుమార్, సమ్మయ్య, సదానందం, అంచు, తెలంగాణ హమాలీ వర్కర్స్ యూనియన్ బాధ్యులు గుంటి సామ్రాజ్యం, మోహన్, రాజేశ్, భారత్ బచావో నాయకులు సదానందం, వెంకట్రాజం, వేల్పుల రత్నం, శామ్యూల్, ఓదెలు తదితరులు పాల్గొన్నారు.

కవిత బెయిల్‌పై సంబరాలు




వేములవాడఅర్బన్: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బెయిల్‌పై విడుదల కావడంపై బీఆర్‌ఎస్ నాయకులు బుధవారం సంబరాలు జరిపారు. వేములవాడ నందికమాన్ వద్ద బుధవారం టపాసులు పేల్చి, స్వీట్లు పంచుకున్నారు. మాజీ సర్పంచులు చెన్నమనేని స్వయంప్రభ, కచ్చుకాయల మంజుల, మాజీ ఎంపీపీ మేకల రజిని, కొమురవ్వ పాల్గొన్నారు.

అన్నదాన ట్రస్ట్‌కు రూ.5 లక్షల విరాళం



వేములవాడ: రాజన్న అన్నదానసత్రం ట్రస్టుకు రూ.5 లక్షల విరాళాన్ని హన్మకొండ జిల్లా నర్సక్కపల్లికి చెందిన ఈగ రమేశ్ బుధవారం అందించారు. ఈ చెక్కును ఈవో వినోద్‌రెడ్డికి అందించారు. పర్యవేక్షకులు వెల్ది సంతోష్, సీనియర్ అసిస్టెంట్లు భీమేశ్వర్, ఎస్.కుమార్ ఉన్నారు.

మిడ్‌మానేరు నీటి విడుదల



బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరు నుంచి బుధవారం ఎల్‌ఎండీకి 14,600, అనంతగిరి ప్యాకేజీ–10లోకి 6,400 క్యూసెక్కుల మేర నీరు విడుదల చేశారు. ప్రాజెక్టులోకి ఎల్లంపల్లి నుంచి 9450, మరో 1050 క్యూసెక్కుల మేర వరద వస్తోంది. మిడ్‌మానేరు ప్రాజెక్టులో ప్రస్తుతం 17.48 టీఎంసీల నీరు ఉంది.

ఆరు మండలాల్లో చిరుజల్లులు

సిరిసిల్ల: జిల్లాలోని ఆరు మండలాల్లో బుధవారం చిరుజల్లులు కురిశాయి. అత్యధికంగా వేములవాడ రూరల్ మండలంలో 4.9 మిల్లీమీటర్ల వర్షం పడగా.. రుద్రంగిలో 0.2, ముస్తాబాద్‌లో 0.8, తంగళ్లపల్లిలో 0.7, ఇల్లంతకుంటలో 0.5, గంభీరావుపేటలో 0.2 మిల్లీమీటర్ల వర్షం పడింది.

1న ఖోఖో జట్ల ఎంపిక పోటీలు

కరీంనగర్‌కల్చరల్: ఖోఖో అసోసియేషన్ కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న ఉమ్మడి జిల్లా సబ్ జూనియర్ ఖోఖో జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు సంఘం ప్రధాన కార్యదర్శి మహేందర్‌రావు ప్రకటనలో తెలిపారు. మానకొండూరు మండలం దేవంపల్లి సాంఘిక సంక్షేమ గురుకులంలో బాలబాలికలకు ఈ పోటీలు జరుగుతాయన్నారు. క్రీడాకారులు ఆధార్‌కార్డు ఒరిజినల్‌తో పాటు జిరాక్స్, పుట్టిన తేదీ ధ్రువపత్రం, స్టడీ సర్టిఫికెట్లతో పాఠశాలలో రిపోర్ట్ చేయాలన్నారు. 08–10–2010 తర్వాత జన్మించి, 14ఏళ్లలోపు వారు అర్హులని పేర్కొన్నారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను సెప్టెంబర్ 13, 14, 15 తేదీల్లో ఖమ్మంలో జరిగే 34వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ ఖోఖో పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు.

జిల్లాలో నాటుతుపాకులు



నాటు తుపాకులు పరిశీలిస్తున్న ఎస్పీ అఖిల్‌మహాజన్, డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి



పోలీసులు పట్టుకున్న నాటు తుపాకులు, తయారీ పరికరాలు

- తయారీదారుడితో సహా.. వినియోగించే ముగ్గురి అరెస్ట్
- గంభీరావుపేట ఠాణాలో కేసు నమోదు
- ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల: రాజన్నసిరిసిల్ల జిల్లాలో వన్యప్రాణుల వేటకు నాటుతుపాకులను తయారు చేసే వ్యక్తిని, వాటిని వినియోగించే ముగ్గురిని పోలీసులు పట్టుకున్నారు. ఎస్పీ అఖిల్‌మహాజన్ బుధవారం ఆ వివరాలు వెల్లడించారు. గంభీరావుపేట మండలం గజసింగవరం గ్రామానికి చెందిన రాయలింగు శంకర్ అనే వ్యక్తి నాటుతుపాకులు తయారు చేసి వన్యప్రాణులను వేటాడే వారికి విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈమేరకు గంభీరావుపేట ఎస్సై రామ్మోహన్ గజసింగవరంలోని రాయలింగు శంకర్ ఇంటికి వెళ్లి తనిఖీ చేయగా వివిధ పనిముట్లను ఉపయోగించి నాటు తుపాకులు తయారు చేస్తున్నట్లు గుర్తించారు. ఈమేరకు అతని వద్ద రెండు తుపాకీ బ్యారెల్స్, తుపాకుల తయారీకి వాడే రంపము, సుత్తి, కత్తి, ఆకురాయి, డ్రిల్లింగ్ మిషన్, దుగోడ మిషన్, ఎయిర్ బుల్లోజర్ స్వాధీనం చేసుకొని శంకర్‌పై కేసు నమోదు చేశారు. దీనిపై ఎల్లారెడ్డిపేట సీఐ శ్రీనివాస్‌గౌడ్ మరింత లోతుగా విచారణ జరపగా.. అదే గ్రామానికి చెందిన కొందరు శంకర్ తయారుచేసిన నాటు తుపాకులను కొని జంతువుల వేటకు ఉపయోగిస్తున్నట్లు గుర్తించారు. ఈమేరకు తుపాకులను వినియోగిస్తున్న రాయలింగు చంద్రమౌళి, శాత్రవేణి హరీశ్, లోగిడి గంగయ్యలను అదుపులోకి తీసుకొని వారి నుంచి రెండు నాటుతుపాకులు, నాలుగు ట్రిగ్గర్ భాగాలు స్వాధీనం చేసుకున్నారు. నాటు తుపాకులను తయారుచేసిన రాయలింగు శంకర్(50), ఆ తుపాకులను వినియోగిస్తున్న రాయలింగు చంద్రమౌళి(40), శాత్రవేణి హరీశ్(27), కోకిడి గంగయ్య(45)లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ ప్రకటించారు. నాటుతుపాకుల తయారీ కేంద్రాన్ని, వినియోగిస్తున్న వారిని చాకచక్యంగా పట్టుకున్న ఎల్లారెడ్డిపేట సీఐ శ్రీనివాస్, గంభీరావుపేట, ఎస్సై రామ్మోహన్, పోలీస్ సిబ్బందిని ఎస్పీ అఖిల్ మహాజన్ అభినందించారు. ఈ సమావేశంలో సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, ఎల్లారెడ్డిపేట ఎస్సై రమాకాంత్ పాల్గొన్నారు.

జాతీయ సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ పోటీలకు ఎంపిక

రామడుగు(చొప్పదండి): మండలంలోని గోపాల్‌రావుపేట అల్ఫోర్స్ పాఠశాలకు చెందిన విద్యార్థులు కె.అశ్విత్ (9వ తరగతి), బి.వరుణ్‌తేజ్, ఎ.స్రవంతి, ఎం.అక్షరలు (8వ తరగతి) జాతీయ స్థాయి సాఫ్ట్ బాల్, బేస్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి తెలిపారు. వీరు అక్టోబర్‌లో హరియాణాలో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను బుధవారం ఆయన అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాజన్న సన్నిధిలో భక్తుల రద్దీ



ఆలయంలో భక్తుల సందడి

వేములవాడ: వేములవాడ రాజన్న సన్నిధిలో బుధవారం భక్తుల రద్దీ నెలకొంది. ధర్మగుండంలో స్నానం చేసినవారు స్వామివారికి అభిషేకం, అన్నపూజ, కల్యాణం, సత్యనారాయణస్వామి వ్రతం చేశారు. అనంతరం కోడెమొక్కు చెల్లించుకున్నారు.

నేడు లక్ష బిల్వార్చన.. అభిషేకాలు రద్దు

రాజన్న ఆలయంలో గురువారం ఆరుద్ర నక్షత్రోత్సవాన్ని పురస్కరించుకొని స్వామివారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి తెలిపారు. అభిషేకాలు రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

సొమ్మసిల్లిన భక్తురాలు

రాజన్నను దర్శించుకునేందుకు వచ్చిన వరంగల్‌కు చెందిన ఓ భక్తురాలు సొమ్మసిల్లి పడిపోయింది. బుధవారం ఉదయం మంత్రి పొన్నం ప్రభాకర్ ఆలయానికి వచ్చారు. దీంతో కాసేపు దర్శనాలను నిలిపివేశారు. ఆ సమయంలో భక్తురాలు కిందపడిపోయింది. గమనించిన కుటుంబసభ్యులు, ఆలయ సిబ్బంది ఆమెకు ప్రథమ చికిత్స చేయించి, అనంతరం ఆస్పత్రికి తరలించారు.